# పోలీసు కేసు

కానిస్టేబులు అప్పారావు 'ఆ నెలలో ఏకేసూ బుక్ చేయలేకపోయాడని పొద్దున్నే ఏస్సైతిట్టిన తిట్లని నేమరేసు కుంటున్నాడు. ఎవరు ఏ ఏ పరిస్థితుల్లో దొరికినా 'బుక్ చేసి కేసెట్టే'యాలని గొప్ప దీనిగా వున్నాడు. అందుకే ఒంటి గంటయినా వీథులు గాలిస్తూ మురికి పేట చేరుకున్నాడు. అప్పుడే కరెంట్ పోయింది. చంద్రుడూ డ్యూటీ ముగించేస్తున్నాడు. అలాటి గుడ్డి వెలుగులో అతని నిద్ర కళ్లకి దూరంగా ఏవో రెండు ఆకారాలు కనబడ్డాయి. విజిల్ వేశాడు. పోలీసు విజిల్‌కి కుక్కలు మొరిగాయి. ఆ ఆకారాలు మరి కొంచెం స్పీడుగా అడుగులు వేశాయి. కేసు దొరికిందను కున్నాడు. 'ఓ మగా ఓ ఆడా' గుట్టు చప్పుడు వ్యవహారం కోసం రోడ్డు మీద దేవులాడుతున్నట్టు పసిగట్టేసాడు. పరుగు లంకించాడు. కుక్కలు మొరుగులకి, కానిస్టేబుల్ విజిల్‌కీ వెనుదిరిగిన వాళ్ళు, అతను పరుగు కూడా కనిపించే సరికి వాళ్లూ పరిగెత్తారు. ప్రక్క సందులో కెళ్లిపోయారు. అప్పారావు టార్చి వేశాడు. సందులు వెతికాడు. పట్టుకున్నాడు. వాళ్లేం చెప్పినా, ఎలా చెప్పినా వినలేదు. "దొంగ నా కొడకల్లారా! ఈ యప్పారావు కళ్లే కప్పుదామనుకుర్రా పదండి. ఈ రాత్రికి మీరు కొట్లో తొంగుందురు గాని' అని లాఠీతో రెండు దెబ్బలు కొట్టి స్టేషన్‌కి తీసుకెళ్లాడు. అక్కడ కెళ్లాక ఏం అనుకున్నాడో గానీ ఇద్దర్నీ చెరోసెల్‌లో పెట్టేసాడు.

తెల్లారేకా విజయగర్వంతో ఎస్సైగారికి సెల్యూట్ కొట్టి రాత్రి 'ఎబిచారం' కేసొకటి బుక్ చేసినట్టు చెప్పాడు. ఎస్సై గార్ని తీసుకొని మొదటి సెల్ దగ్గరకి వెళ్లాడు. వాడు గుర్రుపెట్టి నిద్రపోతున్నాడు. అప్పారావు కానిస్టేబుల్ వాడిని లాఠీతో కొట్టి లేపాడు. వాడు బెంబేలు వడిపోతూ లేచాడు. ఆత్రుతగా నమస్కరించాడు. 'నానేం తప్పు సెయ్యనేదండీ' అని వాడంటుంటే "నోర్మూయ్యిరా నా కొడకా! మరి నేర్రా తప్పుసేసిందీ?" అని మరో దెబ్బ కొట్టి ప్రక్క సెల్‌కి నడిచాడు.

"ఆ లంజ నిందులో నెట్టాన్సార్!" అని తలెత్తే సరికి కనిపించే దృశ్యం అప్పారావుని దిగ్భ్రాంతుణ్ణి చేసింది. గజగజా వణికిపోయాడు. ఎస్సై వళ్లు పటపటా కొరుకుతూ 'ఎబిసారం' కేసు బుక్ చేసానన్నావు. వీణ్ణి చూపెడుతున్నావేంటి? అదేదీ?' అని గద్దించాడు.

అప్పుడే నిద్ర నుంచి లేచి ఆడ వేషం ఇప్పుకుంటున్న జముకుల ఎంకన్న "దండాలు బాబుగారూ! రేత్రి ఒంటి గంట వరకూ జముకుల పాట పాడుకుని ఏసాన్నయినా ఇప్పుకోకుండా మావొస్తా వుంటే జవానుగారి బిగిల్ ఇనిపించి నాదండీ. మాం బయానికి పారెత్తుకొని పారెత్తుకొని వత్తుంటే మమ్మల్ని వట్టుకున్నారండీ. మాం 'ఎబిసారం' సెయ్యనేదండీ అని జాకెట్ విప్పుకొని బ్రా తీస్తున్నాడు.

ఎస్సైకి సిగ్గు వేసింది. అప్పారావుని చూస్తే జాలేసింది. పక్కకి పిలిచాడు. వీళ్లని పేకాట కేసు క్రింద బుక్ చేయి అన్నాడు.

అప్పారావు ఎగిరి గంతేశాడు.